# డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలి



జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఫతేనగర్ కార్పొరేటర్ సతీశ్ గౌడ్

బాలానగర్, మే 15 : అమృత్‌నగర్ తండా వాసులకు డబుల్ బెడ్‌ం ఇండ్లు కేటాయించాలని కోరుతూ గురువారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌కు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ తండావాసులతో కలిసి వినతిపత్రం అందజేశారు. తండాలో 130 కుటుంబాల వారు కొన్ని దశాబ్దాలు ఇక్కడ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వారిలో 65 మంది నిరుపేద కుటుంబాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లలో అవకాశం కల్పించిందని తెలిపారు. మిగిలిన 65 మంది నిరుపేదలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. నాలా సమీపంలో దుర్భర జీవితాలు గడుపుతున్నారని దాంతో తరచూ అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గం కైతలాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో అమృతనగర్ తండా నాయకులు గౌడ నాయక్, మోతీయ నాయక్, పీటర్ నాయక్, పార్వతమ్మ పాల్గొన్నారు.

## సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించాలి

### భగత్‌సింగ్ నగర్ కాలనీ వాసుల విన్నపం

జీడిమెట్ల, మే 15 : చింతల్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించాలని భగత్‌సింగ్ నగర్ కాలనీ వాసులు కోరుతున్నారు. వారు మాట్లాడుతూ.. సంక్షేమ సంఘం గడువు ముగిసి వారం రోజులు గడచినా అడహక్ కమిటీ ఎన్నికల ఊసెత్తడం లేదన్నారు. 2023, మే 7న సంక్షేమ సంఘం ఏర్పడిందని తెలిపారు. సంఘం రద్దు అవుతుందని, హడక్ కమిటీ వారు ఎన్నికల నిర్వహణకు శ్రీకారం చుట్టాలని కోరారు. కొందరు ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్యానల్ సభ్యులను ఏర్పాటు చేసుకున్నట్టు వినికిడి. అడక్ కమిటీ వారు కాలనీలో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రకటన చేసి ఎన్నికలు నిర్వహించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 15: కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో గురువారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 13, వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 35, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజి 13, ఫ్రెంచ్ బీన్స్ 105, క్యారెట్ 25, కాలీఫ్లవర్ 23, దొండ 25, చిక్కుడు 45, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 25, క్యాప్సికం 45, ఆలుగడ్డ 25, కీరా 23, దోసకాయ 18, సొరకాయ 15, పొట్లకాయ 18, కందగడ్డ 95, ఉల్లిపొరక 45, ఉల్లిగడ్డ 18, చింతకాయ –, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ 9నుంచి 10, చామగడ్డ 35, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 60 నుంచి 70, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చి బఠాని ...., పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## మెరుగైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల డీన్ డా. గోవర్ధన్

దుండిగల్ : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, నాగులూర్‌లో గురువారం రైతులకు రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మెరుగైన యాజమాన్య పద్ధతులు, పంట అధిక దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి వ్యవసాయ కళాశాల డీన్ డా.ఎం.గోవర్ధన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పాడిపంట, సమగ్ర వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఐబీటీ డైరెక్టర్, సీనియర్ ప్రొ. డా. సి.వి.సమీర్ మాట్లాడుతూ.. నూతన వంగడాల వినియోగం, చీడపీడల నుంచి తట్టుకునే విధానాలను వివరించారు. శాస్త్రవేత్త డా. కే శైలజ మాట్లాడుతూ.. భూసార పరీక్ష ఉద్దేశ్యం ,మట్టి నమూనాల పరీక్షలు, ఆవశ్యకతను వివరించారు. సేంద్రియ ఎరువుల వాడకం, జీవని ఎరువుల ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్సీ యాదగిరి, రైతులు పాల్గొన్నారు.

## దీక్షకు స్పందించని అధికారులు



ఎనిమిది రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న జనప్రియ నగర్ ఫేజ్5 బాధితులు

మాదాపూర్, మే 15: కాలనీకి జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తీరని అన్యాయం చేశారు. నిర్లక్ష్యంతో నేడు కాలనీలోని 650 ప్లాట్స్ యాజమానులం రోడ్డున పడ్డాం. కాసులకు కక్కుర్తి పడి మాకు అన్యాయం చేశారని జనప్రియ నగర్ ఫేజ్ – 5 యాజమానుల ఆరోపణ.. అంబేద్కర్‌నగర్ కాలనీ ఫేజ్ –5 కి ఆనుకొని ఉండటంతో కాలనీ వాసులు ఫేజ్ –5 కాలనీకి చెందిన రోడ్డును చూపి భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకోవడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులకు అంబేద్కర్‌నగర్ వాసులు ఇచ్చిన కాసులకు కక్కుర్తి పడి ఫేజ్ – 5 యాజమానులకు శోకాన్ని మిగిల్చారని బాధితులు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా చేపట్టిన నిరసన దీక్ష గురువారం 8 వ రోజుకు చేరుకున్నది. అంబేద్కర్ నగర్ వాసులు చేసేది చేసి నిరసన దీక్ష చేపడితే చోద్యం చూస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి ఫేజ్ – 5 యజమానులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంకా చలనం రాలేదని, దీక్షను ఉదృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. కార్యక్రమంలో జనప్రియ నగర్ ఫేజ్ – 5 ప్లాట్ యాజమానులు పాల్గొన్నారు.

## మురుగునీరు చేరకుండా చూడాలి



గాగిల్లాపూర్ తండాలోని ఓ ఇంట్లోకి చేరిన మురుగునీరు

దుండిగల్ : ఇండ్లలోకి మురుగునీరు చేరకుండా చర్యలు చేపట్టాలని దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గాగిల్లాపూర్‌తండా వాసులు కోరుతున్నారు. తండా పరిధిలోని భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగిపొర్లుతోందని, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. బుధవారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికే మ్యాన్‌హోల్ పొంగి ఇండ్లలోకి నీరు చేరిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## నాలాల్లో వ్యర్థాలను తొలగించాలి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సబిహాబేగం

అల్లాపూర్, మే 15 : వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని అల్లాపూర్ కార్పొరేటర్ సబిహాబేగం ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.స్థానిక సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ సబియా బేగం తెలిపారు. గురువారం డివిజన్ సర్దార్ నగర్, రాజీవ్‌గాంధీ నగర్‌లోని నాలాలను అధికారులతో కలిసి పరిశీలించారు.

## బీఈ కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని అన్ని విభాగాల బీఈ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిపోయిన వారికి వన్ టైమ్ చాన్స్ కల్పించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఓయూ అకాడమిక్ సెనేట్ స్టాండింగ్ కమిటీ అనుమతించిందని చెప్పారు. 2000 సంవత్సరం తరువాత ఆయా కోర్సుల్లో చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. ఈ కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్ష ఫీజును ఈ నెల 24వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో కలిపి 27వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్ష విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.omania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్మెంట్ కోర్సుల (బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్షలను ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## బీఈ చివరి సెమిస్టర్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ చివరి సెమిస్టర్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) ఎనిమిదో సెమిస్టర్ మెయిన్, బ్యాక్ లాగ్, బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) చివరి సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 24వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుముతో 27వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## క్యాప్ జెమినీతో ఎంవోయూ కుదుర్చుకున్న బీవీఆర్‌ఐటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల




అవగాహన పత్రాలను పరస్పరం మార్చుకుంటున్న సంస్థల ప్రతినిధులు

దుండిగల్ : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లి, రాజీవ్‌గాంధీ నగర్ సమీపంలోని బీవీఆర్ఐటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం, క్యాప్ జెమినీ సంస్థతో పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నది. గురువారం కళాశాలలో ఇరు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేసిన పత్రాలను మార్చుకున్నారు. ఇరు సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ.. ఈ ఒప్పందం విద్యార్థులను ఆవిష్కర్తలుగా రూపొందించేందుకు తోడ్పాటును అందిస్తుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో క్యాప్ జెమినీ నిపుణుల టెక్నికల్ టాక్స్ విద్యార్థులకు ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో శ్రీ విష్ణు విద్యా సంస్థల వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, కార్యదర్శి ఆదిత్య విషం కె, క్యాప్ జెమినీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సమీర్ షా , వినోద్ జైన్ , రితేష్ రంజన్ , తేజవి పాల్గొన్నారు.

## ఇంప్రూవ్ మెమోరీ ధ్రువీకరణ పత్రాలు అందజేత




కుత్బుల్లాపూర్, మే 15 : ఇంప్రూవ్ మెమోరీ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో బాలలకు ప్రపంచ దేశాలు, జాతీయ జెండాలు, రాజధానులు, కరెన్సీలు, గొప్ప వ్యక్తులు, జాతీయ పార్కులు , బుక్స్ రచయితలు, వరల్డ్ మ్యాప్ పాయింటింగ్ అంశాల్లో ప్రావీణ్యం సాధించేందుకు శిక్షణ ఇచ్చారు. గురువారం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సుచిత్రలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్లు కరుణ్ కుమార్, డాక్టర్ అనిత కరుణ్ కుమార్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.



మియాపూర్ : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శ్రీ శ్రీ భూ సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవస్థానం భవ్యాస్ తులసీవనంలో దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఆరంభమయ్యాయి. మొదటిరోజు స్వామి వారికి విశ్వక్సేన ఆరాధన,పుణ్యాహవచనం ,అగ్ని ప్రతిష్ట ,వాస్తుహోమం, ద్వజారోహణం, శేషవాహనోత్సవం తిరుమల తిరుపతి ఆగమపండితులతో ఆనంద ప్రసాద్ కృష్ణ కుమారి దంపతుల ఆధ్వర్యంలో జరిగాయి.

## రాంగ్‌రూట్‌లో వచ్చి.. దురుసు ప్రవర్తన

శేరిలింగంపల్లి, మే 15: రాంగ్ రూట్‌లో వెళ్లడమే కాకుండా అడ్డుకున్న ట్రాఫిక్ ఎస్ఐతో వాగ్వాదానికి దిగి చేతిలోని ట్యాబ్ లాక్కొని విధులకు ఆటంకం కల్గించిన యువకుడిపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ట్రాఫిక్ ఎస్ఐ రమేశ్, హెడ్ కానిస్టేబుల్ గోపాల్, హోంగార్డులు గురువారం ఉదయం 11 గంటల సమయంలో శ్రీరాంనగర్ కాలనీలోని కేఎస్ బేకర్స్ యూటర్న్ వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ద్విచక్ర వాహనంపై రాంగ్ రూట్లో వచ్చిన అభిషేక్ గుప్తా అనే వ్యక్తిని ఆపారు. రాంగ్ రూట్లో వచ్చినందుకు చలానా విధిస్తామని ఫోన్ నంబర్ చెప్పాలని అడగగా పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. ట్రాఫిక్ ఎస్ఐ చేతిలోని ట్యాబ్‌ను లాక్కొని దురుసుగా ప్రవర్తించాడు. దీంతో ట్రాఫిక్ ఎస్ఐ రమేశ్.. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 18 వరకు సన్నబియ్యం

అబిడ్స్ : జంట నగరాలలోని ఆహార భద్రత కార్డుదారులకు ఈ నెల 18 వరకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని హైదరాబాద్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రమేష్ పేర్కొన్నారు. హైదరాబాదులోని ఆహార భద్రత కార్డుదారులకు 14334.678 మెట్రిక్ టన్నుల బియ్యం కోటాలను విడుదల చేయడం జరిగిందని అన్నారు. మే 15 వరకు 596925 కార్డుదారులు 13805.320 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేసినట్లు వివరించారు. మిగిలిన వారు సన్నం బియ్యం తీసుకోవాలని మే 18 వరకు పంపిణీ చేయాలని నిశ్చయించినట్లు తెలిపారు.

### దరఖాస్తుల పరిశీలన

**కీసర,మే 15:** దమ్మాయిగూడ మున్సిపాల్టీ కార్యాలయ ంలో రాజీవ్ యువవికాసం సంబంధించిన దరఖాస్తుల పరిశీలిస్తున్నారు.దమ్మాయిగూడ మున్సిపాల్టీకి చెందిన బిల్ కలెక్టర్లు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి దరఖాస్తు దారులందరు కుల, ఆదాయ, రేషన్‌కార్డు, ఆధార్, పాన్ కార్డులను తీసుకురమ్మని చెప్పడంతో దమ్మాయిగూడ మున్సిపాల్టీ పరిధిలోని పలు వార్డు కార్యాలయాల్లోని దరఖాస్తు దారులు మున్సిపాల్టీ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. మున్సిపాల్టీ పరిధిలో సుమారు 15000వేల మంది దరఖాస్తు చేసుకొన్నట్లు అధికారులు తెలిపారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



రవీంద్రభారతి, మే15 : అక్షిత ఫౌండేషన్ మరియు నటరాజ్ అకాడమీ ఆధ్వర్యంలో 17వ వార్షికోత్సవం సం దర్భందగా గురువారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో ఐకాన్ అవార్డులు జైహింద్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్, డా.ఆలేటి శ్రీనివాస్‌గౌడ్, తుంగతుర్తి రవి ,ఆర్.వరప్రసాద్, ఆమని ములుగు, మద్దెల సందీప్‌కుమార్, నటరాజ్ వ్యవస్థాపకుడు నల్లా గిరి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి పలువురి నృత్య కళాకారులకు ఐకాన్ అవార్డులను బహూకరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కూచిపూడి, భరతనాట్యం మన దేశ వారసత్వ సంపదని, ఈ కళలు మన సాంస్కృతి,సాంప్రదాయాలను పరిరక్షిస్తున్నాయని పేర్కొన్నారు.ప్రాచీన కళలను భావితరాలకు అందించాల్సిన అవశ్యకత గురువులపై ఉందన్నారు. ఎందరో గొప్ప గొప్ప మహనీయులు శాస్త్రీయ లలిత కళలను భవిష్యత్ తరాలకు అందించారని చెప్పారు. సభకు ముందు చిన్నారుల కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నది.ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల గిరి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం నిర్వహణకు సహకరించాలి



ఏఎస్‌రావునగర్ డివిజన్ భవానీనగర్‌కాలనీ వాసులతో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, పాల్గొన్న అడిషనల్‌కమిషనర్ రఘు ప్రసాద్, డీసీ జగన్

**కాప్రా, మే 15:** కాలనీలో పారిశుధ్యం సక్రమ నిర్వహణకు కాలనీ ప్రజలు పారిశుధ్య విభాగానికి సహకరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ప్రజలను కోరారు. బుధవారం జవహర్‌నగర్ పర్యటనకు వెళ్లి తిరిగి వస్తున్న సందర్భంగా ఇదే దారిలోని ఏఎస్‌రావునగర్ డివిజన్ భవానీనగర్ కాలనీలో ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీవాసులతో ఏర్పా టు చేసిన ముఖాముఖి సమావేశంలో ఎగువనుంచి వచ్చే వర్షపునీరు కాలనీలో నిలువడం వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నామని, ఇందుకోసం స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌లను నిర్మించాలని, పారిశుధ్య విభాగంలో ఖాళీలను భర్తీ చేయాలని కాలనీ ప్రతినిధులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేయగా దీనిపై సర్కిల్ డీసీ జగన్, ఈఈ నాగేందర్ తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్ మాట్లాడుతూ పారిశుధ్య విభాగంలో ఖాళీగా ఉన్న స్థానాలను రక్తసంబంధీకులనుంచి భర్తీ చేసేందుకు ప్రభుత్వం నుంచి ఇటీవలే ఆదేశాలు జారీ అయ్యాయని, త్వరలో ఖాళీగా ఉన్న స్థానాల్లో సిబ్బందిని భర్తీ చేయనున్నట్టు తెలిపారు. కాలనీలో ఎలాంటి సమస్యలు లేకుండా, భవానీనగర్ కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కాలనీ మాజీ అధ్యక్షులు అంజిరెడ్డి జీహెచ్ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలపై కాలనీ అధ్యక్ష కార్యదర్శులు వి.శేఖర్, శ్రీరాములు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, డీసీ జగన్, ఈఈ నాగేందర్, ఏఎంఓహెచ్ డాక్టర్ మధుసూధన్‌రావు, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, జవా న్లు, ఎస్ఎఫ్ఏలు స్థానికులు పాల్గొన్నారు.

## వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీపీఈడీ, డీపీఈడీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలతో పాటు బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్ సైట్ www. osmania. ac.inలో చూసుకోవాలని సూచించారు.

## సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

కాప్రా/మేడ్చల్, మే 15 : కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు మేడ్చల్,కుషాయిగూడ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు మేడ్చల్, కుషాయిగూడ డిపో మేనేజర్లు మహేష్‌కుమార్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి 26వ తేదీ వరకు బస్సులు నడుస్తాయన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు ప్రత్యేక మెట్రో డీలక్స్ బస్సు ప్రార ంభం అవుతుందని, మరుసటి రోజు తెల్లవారు జామున 3 గంటలకు అక్కడి చేరుకొని, తిరిగి ఉదయం 9 గంటలకు బయల్దేరుతుంద న్నారు. టిక్కెట్లు బస్సులో, ఆన్లైన్‌లో www.tgsrtc.in వెబ్ సైట్ నుంచి పొందవచ్చన్నారు. వివరాలకు 9110505 820, 96035 49388 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని డీఎం కోరారు. చార్జీలు పెద్దలకు రూ. 790, పిల్లలకు రూ.590 ఉంటాయని, ఈ అవకాశా న్ని సద్వినియోగం చేసుకోవాలని కాళేశ్వరం పుష్కరాలకు వెళ్లే ప్రయాణికులకు డీఎంలు విజ్ఞప్తి చేశారు.

## 17న అల్వాల్ ఐటీఐలో జాబ్ మేళా

మేడ్చల్ కలెక్టరేట్, మే 15: అల్వాల్ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 17న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన వ్యక్తులకు అప్రెంటిస్ షిప్ ఉంటుందని,ఎంప్లాయిమెంట్ www. employment. telangana.gov.inలో పేర్లు నమోదు చేసుకొని కార్డు పొందాలని సూచించారు. వివరాలకు 9059529377, 9000385 863, 7386809422, 9866465024, మెయిల్ ఐడీః rajsekhar<bha> @</ bha> yskinfotech.com సంప్రదించాలని అన్నారు.